


గాయత్రీ దీప మహాయజ్ఞం

పొన్నూరు: స్థానిక సాక్షి భావన్నారాయణ స్వామి గుడిలో అఖిల విశ్వ గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో ఆదివారం గాయత్రీ దీప మహా యజ్ఞం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 555.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 9,567 క్యూసెక్కులు వదిలారు.



కలశాలతో శోభాయాత్ర

పిడుగురాళ్ల: ప్రసన్నాంజనేయస్వామివారి మూల విరాట్‌కు ఆదివారం అభిషేకం నిర్వహించారు. మహిళా భక్తులు కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు.

ప్ర'తి రంగా'న విరాజిల్లాలి

- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అభిలాష
- వైభవంగా గణతంత్ర దినోత్సవం
- పోలీస్ పరేడ్ మైదానంలో వేడుకలు
- ఉప్పొంగిన జాతీయ స్ఫూర్తి



పతాక సందేశం ప్రసంగిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, చిత్రంలో ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

గుంటూరు వెస్ట్/లక్ష్మీపురం: అన్ని రంగాల్లోనూ జిల్లా అభివృద్ధి పథాన పయనిస్తోందని, ఇదే బాటలో ముందుకు సాగాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆకాంక్షించారు. ఆదివారం స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో గణతంత్ర దిన వేడుకలు వైభవంగా జరిగాయి. తొలుత కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె ప్రసంగిస్తూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల గురించి వివరించారు.

సేద్యానికి భరోసా

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 2.15 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయని, రబీ సీజన్‌లో 1.8 లక్షల ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, ఇప్పటి వరకు 1.5 లక్షల ఎకరాల్లో పంటలు వేశారని కలెక్టర్ వివరించారు. 1.2 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా చేశామని, వ్యవసాయాంత్రీకరణలో భాగంగా కిసాన్ డ్రోన్‌లు ఒక్కొక్కటి రూ.8 లక్షల సబ్సిడీతో పంపిణీ చేసేందుకు గ్రూపులను ఎంపిక చేశామని పేర్కొన్నారు. 85,460 మంది రైతులకు రూ.34 కోట్ల పెట్టుబడిగా అందించామని వివరించారు. 2024 సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాల వల్ల పంట నష్టపోయిన 24,589 మంది రైతులకు రూ.43 కోట్లు పెట్టుబడి రాయితీ అందించామని వెల్లడించారు. జిల్లా వార్షిక రుణ ప్రణాళికలో రూ.24,502 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా, సెప్టెంబరు 30 నాటికి రూ.16,855 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. ఉద్యాన పంటల అభివృద్ధికి రూ.14.6 కోట్లు ఖర్చుచేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. 2,200 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యానికి ప్రణాళిక రూపొందించామని, ఇప్పటి వరకు 488 మంది రైతులకు 336 హెక్టార్లలో సూక్ష్మ సాగు నీటి పథకం ద్వారా లబ్ధి చేకూరిందని వివరించారు. గుంటూరు, తెనాలి, దుగ్గిరాల మార్కెట్ యార్డుల్లో 5.2 లక్షల క్వింటాళ్ల పంటను ఈనాం ద్వారా విక్రయించామని పేర్కొన్నారు. 131 రైతు సేవా కేంద్రాల ద్వారా 4,260 మంది రైతుల నుంచి 26,682 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రూ. 6.5 కోట్లను 48 గంటల్లోనే వారి ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు.

- దీపం -2 పథకం ద్వారా ఇప్పటి వరకు 3.61 లక్షల మంది గ్యాస్ వినియోగదారులకు రూ. 29.2 కోట్లు సబ్సిడీగా అందించామని కలెక్టర్ వెల్లడించారు.
- 5.99 లక్షల రేషన్ కార్డులకు ప్రతినెలా 8,990 టన్నుల పోర్టిఫైడ్ బియ్యంతోపాటు 468 మెట్రిక్ టన్నుల కందిపప్పు, 283 మెట్రిక్ టన్నుల పంచదారను 972 ప్రభుత్వ చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.
- వైద్య ఆరోగ్య రంగంలో 49 మంది వైద్యులను 349 మంది సిబ్బందిని నియమించామని కలెక్టర్ చెప్పారు.
- 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, తొమ్మిది పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 12 గ్రామీణ ఆరోగ్య మందిరాలు ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్లు పొందడం గర్వకారణమని పేర్కొన్నారు.
- పీఎం మాతృవందన యోజన ద్వారా 8,600 మంది గర్భిణులకు రూ. 3 కోట్లు అందించామని పేర్కొన్నారు.
- గుంటూరు వైద్య కళాశాలలో రూ.41.5 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు.
- ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా 152 ప్రభుత్వ, ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల ద్వారా ఇప్పటి వరకు రూ. 234 కోట్లతో 1.17 లక్షల మంది రోగులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.
- సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా రూ. 23.79 కోట్లతో 99,150 మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌లు అందించామని తెలిపారు.
- డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, హైస్కూళ్లలో చదివే 92,067 మంది విద్యార్థులకు భోజనం అందిస్తున్నామని వివరించారు. దీనికోసం ఏటా రూ. 31 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు.
- పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా రూ. 15 కోట్ల అంచనాలతో 26.8 కిలోమీటర్ల మేర రహదారుల పనులకు నిధులు మంజూరయ్యాయని, 14.6 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయని వివరించారు. ఇంకా వివిధ పథకాల ద్వారా రూ.52.5 కోట్ల అంచనాతో 50.06 కిలో మీటర్ల మేర రహదారుల నిర్మాణం, మూడు వంతెనల నిర్మాణ పనులు మంజూరైనట్టు వెల్లడించారు.
- మత్స్యశాఖ ద్వారా 35 వేల టన్నుల చేపలు, 72 వేల టన్నుల రొయ్యల ఉత్పత్తులు సాధించామని కలెక్టర్ పేర్కొన్నారు.
- పీఎంఎంఎస్‌వై ద్వారా ప్రకాశం బ్యారేజీ జలాశయంలో 12.5 లక్షల చేప పిల్లలను విడుదల చేశామని వివరించారు.
- ఖరీఫ్‌లో 2 లక్షల ఎకరాలకు 24 టీఎంసీల నీరు విడుదల చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.
- గుంటూరు చానల్ ఆధునికీకరణ కోసం రూ. 675 కోట్లతో అంచనాలతో పరిపాలనా అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపామని చెప్పారు.
- 544 అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ.1.8 కోట్లతో మౌలిక వసతులు కల్పించామని పేర్కొన్నారు.
- జిల్లాలో 73,937 గృహాలు పీఎం ఆవాస్ యోజన ద్వారా చేపట్టామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 23 వేల గృహాలు పూర్తి కాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు.
- ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా 2.60 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతినెలా 1న రూ.110.16 కోట్లు అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు.



కలెక్టర్ నాగలక్ష్మికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పోలీస్ డాగ్



వేడుకలను తిలకిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ కుటుంబసభ్యులు



వేడుకలను తిలకిస్తున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కుటుంబసభ్యులు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు

ఉత్తమ సాంస్కృతిక ప్రదర్శనలకు కలెక్టర్ బహుమతులు అందించారు. పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌కు మొదటి బహుమతి, సెయింట్ లారెన్స్ పబ్లిక్ స్కూల్‌కు ద్వితీయ బహుమతి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు తృతీయ బహుమతి లభించాయి.

- శకటాలనూ బహుమతులు వరించాయి. జిల్లా విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల శాఖ శకటానికి మొదటి బహుమతి, గుంటూరు నగరపాలక సంస్థకు ద్వితీయ బహుమతి, గృహ నిర్మాణ సంస్థకు తృతీయ బహుమతి లభించాయి. వ్యవసాయ శాఖ స్టాల్ మొదటి స్థానం, పేదరిక నిర్మూలన సంస్థ స్టాల్‌కు ద్వితీయస్థానం, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ స్టాల్ తృతీయ స్థానం సాధించాయి. పశుసంవర్ధక శాఖ కన్సొలేషన్ బహుమతి పొందింది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ప్రభుత్వ శాఖలు ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేశాయి. శకటాలను ప్రదర్శించాయి. పోలీసులు కవాతు నిర్వహించారు. జాగిలాలతో ప్రత్యేక ప్రదర్శన చేశారు. ఎన్‌సీసీ, స్కాట్స్ అండ్ గైడ్స్ క్యాడెట్ల విన్యాసాలు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో ఎస్పీ సతీష్‌కుమార్ శాసన మండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు, చంద్రగిరి ఏసురత్నం, శాసన సభ్యులు గళ్లా మాధవి, మహమ్మద్ నసీర్ అహ్మద్, తెనాలి శ్రావణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్, అడిషనల్ ఎస్పీ సుప్రజ, డీఆర్వో ఖాజావలి పాల్గొన్నారు.



ప్రమాదాలు జరిగినప్పుడు చేసే విన్యాసాలు ప్రదర్శిస్తున్న అగ్నిమాపక శకట సిబ్బంది



ఆకట్టుకున్న విద్యా, సమగ్ర శిక్ష శకటం



గణతంత్ర దినోత్సవం సందర్భంగా మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న పోలీసు సిబ్బంది

న్యూస్‌రీల్

ఐజీ కార్యాలయంలో జెండా వందనం



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయ ఆవరణలో ఆదివారం గణతంత్ర దినోత్సవం జరిగింది. జాతీయ జెండాను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఎగురవేశారు. గుంటూరు ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, సీసీ రాఘవ, సీఐ ఆరోగ్యరాజు, ఐజీ, జిల్లా ఎస్పీ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..



నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో ఆదివారం గణతంత్ర దినోత్సవం జరిగింది. జాతీయ జెండాను ఎస్పీ సతీష్‌కుమార్ ఎగురవేసి జెండా వందనం చేశారు. ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), హనుమంతు (ఏఆర్), కార్యాలయ ఏఓ అద్దంకి వెంకటేశ్వరరావు, డీఎస్పీలు బి.సీతారామయ్య (ఎస్‌బీ), ఏడుకొండలురెడ్డి (ఏఆర్), అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నంబూరులో తాత్కాలిక హాల్టింగ్

రైల్వేస్టేషన్(విజయవాడసెంట్రల్): గుంటూరులోని కాజలో జరుగుతున్న బైబిల్ మిషన్ సదస్సులకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నంబూరు స్టేషన్‌లో రెండు నిమిషాల పాటు తాత్కాలింగా హాల్టింగ్ సదుపాయం కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈనెల 26 నుంచి 29 వరకు నర్సాపూర్-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17281), సికింద్రాబాద్-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (17015) రైళ్లు నంబూరు స్టేషన్‌లో ఆగనున్నాయి. బైబిల్ మిషన్ వార్షిక సదస్సు కోసం వేలాదిగా తరలివచ్చే ప్రయాణికుల సౌకర్యం కోసం దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ కాకినాడ టౌన్-గుంటూరు మధ్య ప్రత్యేక అన్ రిజర్వ్‌డ్ రైలును (ప్యాసింజర్) నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. కాకినాడ టౌన్-గుంటూరు ప్రత్యేక రైలు (07223) ఈనెల 26న ఉదయం 5.30 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి, అదే రోజు మధ్యాహ్నం 12.50 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07224) ఈనెల 29న మధ్యాహ్నం 1.30 గంటలకు గుంటూరులో బయలుదేరి, అదే రోజు రాత్రి 8.40 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. వయా నిడదవోలు, ఏలూరు మీదుగా నడిచే ఈ రైలుకు అన్ని స్టేషన్లలో ఒక నిమిషం పాటు హాల్టింగ్ కల్పించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం

తెనాలిరూరల్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం కావడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెదరావూరు గ్రామానికి చెందిన కొడాలి చంద్రకాంత్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి పండగకు ఇంటికి వచ్చిన అతను కనబడకుండా పోయాడు. ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1,716 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 100 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 239 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 180 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 80 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 600 క్యూసెక్కులు వదిలారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న మోదుగుల చిత్రంలో ఎమ్మెల్సీ ఏసురత్నం, వజ్రబాబు, నూరిఫాతిమా తదితరులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆదివారం గణతంత్ర దినోత్సవం జరిగింది. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ గుంటూరు, పల్నాడు జిల్లాల పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, నగర అధ్యక్షుడు, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు), తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ముఖ్య అతిథులుగా హాజరై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబం కంటే దేశం గొప్పదని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఎప్పుడూ పేదల పక్షానే ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ఎంతో మంది త్యాగధనుల కృషి ఫలితమే గణతంత్ర భారతమని పేర్కొన్నారు. డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు) మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను కాపాడుతూ.. మహనీయులు చూపిన అడుగు జాడల్లో వైఎస్సార్ సీపీ ముందుకు సాగుతోందన్నారు. తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, పార్టీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మానసిక వైద్యుల సంఘానికి బెస్ట్ స్టేట్ బ్రాంచ్ అవార్డు



బెస్ట్ స్టేట్ బ్రాంచ్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ ఇవటూరి శరత్‌చంద్ర, ఇతర నేతలు

గుంటూరు మెడికల్: ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ మానసిక వైద్యుల సంఘం రాష్ట్ర శాఖకు బెస్ట్ స్టేట్ బ్రాంచ్ అవార్డును అందజేసింది. జనవరి 22 నుంచి 25 వరకు హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి మానసిక వైద్యుల సంఘం వార్షిక సమావేశంలో 2024 సంవత్సరానికి ఏపీకి అత్యున్నత రాష్ట్ర శాఖ అవార్డు లభించింది. గత ఐదు దశాబ్దాలలో తొలిసారిగా ఈ పురస్కారం ఏపీకి దక్కింది. సేవా కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు , వైజ్ఞానిక సదస్సులు నిర్వహించడంలో అన్ని రాష్ట్రాల కంటే ఏపీ ముందంజలో నిలిచిన కారణంగా ఈ అవార్డు లభించింది. రాష్ట్రవ్యాప్తంగా మానసిక వైద్య నిపుణులు మానసిక ఆరోగ్యంపై ఎన్నో అవగాహన, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గత రెండేళ్లగా అనంతపురంలో డాక్టర్ యెండ్లూరి ప్రభాకర్ , గుంటూరులో డాక్టర్ ఐవీఎల్ నరసింహారావు పూర్వ అధ్యక్షులుగా, విశాఖపట్నంలో డాక్టర్ జీవీఎస్ మూర్తి ప్రస్తుత అధ్యక్షులుగా, కార్యదర్శిగా డాక్టర్ ఇవటూరి శరత్ చంద్ర పర్యవేక్షణలో ఎన్నో వినూత్న కార్యక్రమాలను నిర్వహించారు. యువ మానసిక వైద్యుల సహకారంతో జరిగిన విజ్ఞాన సదస్సులు ఏపీకి రాష్ట్ర ఉత్తమశాఖ పురస్కారాన్ని పొందడానికి దోహదపడ్డాయి.

బైబిల్ మిషన్ మహోత్సవాలు ప్రారంభం

పెదకాకాని: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట బైబిల్ మిషన్ మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు నాలుగు రోజులపాటు జరగనున్నాయి. రాష్ట్ర నలుమూలలతోపాటు దేశవిదేశాల నుంచి భక్తులు తరలివచ్చారు. తొలుత కాకాని స్వస్తిశాల సంగీత బృంద సభ్యులు ప్రత్యేక క్రైస్తవ భక్తి కీర్తనలు ఆలపించి భక్తులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె. శామ్యేల్ కిరణ్ వాక్యోపదేశం చేశారు. క్రీస్తు బోధనలను వివరించారు. బైబిల్ మిషన్ సెక్రటరీ రెవరెండ్ కె.ప్రశాంత్ కుమార్, రెవరెండ్ రాజు, రెవరెండ్ పి.ప్రకాష్ ఓనేసం, రెవరెండ్ సత్య ప్రకాష్, రెవరెండ్ డాక్టర్ డేనియల్ దినకర్‌లు దైవ సందేశాలు అందించారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, కేరళ, బిహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలతోపాటు విదేశాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో మహోత్సవాల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. పెదకాకాని స్వస్తిశాలకు కూడా భక్తుల తాకిడి పెరిగింది. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆహారం, తాగునీరు అందించారు. సుమారు 50 ఎకరాల్లో విశాలమైన పందిళ్లు ఏర్పాటు చేశారు. బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యేల్ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ పి.జాన్ దేవదాసు, సెక్రటరీ కె.ప్రశాంత్ కుమార్, జాయింట్ సెక్రటరీలు డి.సుధాకర్, జె.ఆగమనరావు, ఎం.స జీవరావు, గవర్నింగ్ బాడీ సభ్యులు సారథ్యంలో మహోత్సవాలు నిర్వహిస్తున్నారు.



ప్రార్థనల్లో పాల్గొనేందుకు తరలివచ్చిన భక్తజన సందోహం

నేటి షెడ్యూల్ వివరాలు

బైబిల్ మిషన్ మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా రెండోరోజు సోమవారం తెల్లవారుజామున ధ్యానం, క్రైస్తవ కీర్తనల ఆలాపన ఉంటాయి. అనంతరం పాస్టర్లు దైవ సందేశాలు అందిస్తారు.



ప్రసంగిస్తున్న బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ శామ్యేల్ కిరణ్

తాడేపల్లిలో దొంగనోట్ల కలకలం

- డిపాజిట్ మిషన్‌లో రూ.500 నోట్లు ప్రత్యక్షం
- పోలీసులను ఆశ్రయించిన బ్యాంకు అధికారులు
- పాత నేరస్తుల పని అని అనుమానం
- విచారణలో పోలీసుల జాప్యం

మంగళగిరి (తాడేపల్లిరూరల్): తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగనోట్ల చలామణి యథేచ్ఛగా సాగుతోంది. అయినా పోలీసులు ఉదాసీనవైఖరి ప్రదర్శిస్తున్నారు. స్థానిక ఇండియన్ బ్యాంకు ఏటీఎం సెంటర్‌లోని డిపాజిట్ మిషన్‌లో కుంచనపల్లికి చెందిన ఓ యువకుడు రూ.50వేలు నగదు జమ చేస్తుండగా కొన్ని నోట్లు మిషన్లో చిక్కుకుపోయాయి. అతని ఖాతాలో రూ.32 వేలు మాత్రమే జమయ్యాయి. దీంతో అతను బ్యాంకు అధికారులను సంప్రదిస్తే వారు మిషన్‌లో చిక్కుకున్న నోట్లు దొంగనోట్లుగా గుర్తించి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో 15 రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. అయినా పోలీసులు కేసు నమోదు చేయకుండా, విచారణ చేయకుండా పక్కన పెట్టారు. యువకుడికి ఆ నోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో విచారణ చేస్తే దొంగనోట్ల మూలాలు తెలిసే అవకాశం ఉన్నా.. పోలీసులు పట్టించుకోవట్లేదు. తాడేపల్లికి చెందిన పలువురు రాష్ట్రవ్యాప్తంగా దొంగనోట్ల చలామణి వ్యవహారంలో కీలకపాత్ర పోషిస్తున్నారని సమాచారం. ఇదిలా ఉంటే శనివారం తాడేపల్లిలోని ఓ పెట్రోల్ బంకులో దొంగనోటు ఇచ్చి పెట్రోల్ కొట్టించుకున్నట్లు బంకు సిబ్బంది గుర్తించారు. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి దొంగనోట్ల వ్యవహారాన్ని తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

గతంలో దొంగనోట్ల పేరుతో బురిడీ

గతంలోనూ మంగళగిరి నియోజకవర్గంలో దొంగనోట్ల మార్పిడి ఘటనలు జరిగాయి. స్థానిక స్పెన్సర్ వద్ద అసలు నోట్లు ఇస్తే రెట్టింపు మొత్తం దొంగనోట్లు ఇస్తామని నమ్మించి, పోలీసులు దాడి చేసినట్టు నాటకమాడి తెనాలికి చెందిన వ్యాపారి వద్ద రూ.25 లక్షలు అపహరించిన ఘటనలో పోలీసులు సీతానగరానికి చెందిన ముగ్గురిని అరెస్ట్ చేశారు, ప్రధాన సూత్రధారి ఇప్పటికీ పరారీలో ఉన్నాడు.

సేవకు సముచిత పురస్కారం



కలెక్టర్ నాగలక్ష్మి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్



సుప్రజ, అదనపు ఎస్పీ, క్రైమ్స్ | వాసు, సీఐ తాడికొండ | రామకృష్ణారెడ్డి, సీఐ | రవికుమార్, కానిస్టేబుల్ | ఎం.శ్రీనివాసరెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ | కె.శ్రీనివాసరావు ఆర్డీఓ | ఎస్.వెంకటేశ్వర్లు జిల్లా వ్యవసాయాధికారి | ఆర్.మహీపాల్ రెడ్డి ఎల్‌డీఎం | జి.లక్ష్మీ, సివిల్ సప్లయి డీఎం | కోమలీ పద్మ, డీఎస్‌ఓ



సిహెచ్.సువార్త, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ | జి.విజయలక్ష్మి, సమగ్రశిక్ష అభియాన్ పీడీ | డాక్టర్ విజయలక్ష్మి, డీఎంఅండ్‌హెచ్‌ఓ | జయప్రకాష్, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో ఆర్డినేటర్ | డాక్టర్ ఉమా జ్యోతి, సైకియాట్రిస్ట్ | ఎల్.వజ్రశ్రీ, ఏపీఎంఐపీపీడీ | వెంకట సాయి, జిల్లా మైనింగ్ డీడీ | వై.బాల లక్ష్మీకుమారి, జూనియర్ అసిస్టెంట్ | షేక్.మస్తాన్‌వలి, జిల్లా స్టెప్ ఆఫీస్, డీఈఓ | గాలి దేవుడు, జిల్లా ఫిషరిష్ శాఖ



డి.వందనం, భూగర్భ జలవనరుల శాఖ డీడీ | పి.శేషశ్రీ, సీపీఓ | డి.శైలజ, జిల్లా రిజిస్ట్రార్ | జి.బ్రహ్మయ్య, పంచాయితీ రాజ్ ఎస్ఈ | ఆర్.శ్రీనివాసమూర్తి, ఆర్ఎండీ ఎస్ఈ | ఎం.వి.శివకుమార్ రెడ్డి, డీసీఐ ఫ్యాక్టరీస్ | ఎం.డి. రఫిక్, సమాచార శాఖ డీడీ | భాస్కర్, సివిల్ సప్లయి డీడీ | జె.శ్యామ్ కుమార్, సమాచార శాఖ డివిజనల్ పీఆర్ఓ | సిహెచ్.శివరామకృష్ణ, సమాచార శాఖ టైపిస్ట్ | కావ్య, ఏడీసీ గ్రామవార్డు సచివాలయం | బూదాటి సాగర్, 2వ అదనపు సబ్ కోర్టు ఏపీసీ | గౌస్, జిల్లా కలెక్టర్ సీసీ | చైతన్య, జిల్లా కలెక్టర్ సీసీ



రాజేష్ జాయింట్ కలెక్టర్ సీసీ | గోపాలకృష్ణ, తహసీల్దార్ తెనాలి | కె.బాలగురవయ్య, ఎస్ఆర్‌సీ మంగళగిరి | కె.లాబాన్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ సీనియర్ అసిస్టెంట్ | ఎం. వీరాచారి, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి

ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులను కలెక్టర్ నాగలక్ష్మి పురస్కారాలతో సత్కరించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు మైదానంలో జరిగిన కార్యక్రమంలో దాదాపు 580 మందికి కలెక్టర్‌తోపాటు జేసీ భార్గవ్ తేజ, ఎస్పీ సతీష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్ ప్రశంసా పత్రాలు అందించారు. అలాగే పలువురు స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల కుటుంబ సభ్యులను కలెక్టర్ నాగలక్ష్మి సన్మానించారు. స్వాతంత్ర్య సమరయోధుడు అనుమోలు సూరయ్యకు రెండు సెంట్ల నివేశన స్థలం పట్టాను అందించారు.

యువశక్తితో అద్భుతాల ఆవిష్కరణ

- భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణ
- ముగిసిన భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్
- చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న వైజాగ్ వెలాసిటీ-3 జట్టు



వైజాగ్ వెలాసిటీ-3 జట్టుకు ఛాంపియన్‌షిప్ ట్రోఫీ అందజేస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: యువశక్తితో అద్భుతాలు ఆవిష్కరించొచ్చని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో భాష్యం ప్రీమియర్ లీగ్ సెంట్రల్ లెవల్ టీ20 క్రికెట్ టోర్నమెంట్ బీపీఎల్ 2024–25లో భాగంగా ఆదివారం జేకేసీ కళాశాల మైదానంలో ఫైనల్ మ్యాచ్ జరిగింది. హైదరాబాద్ హైలాండర్స్–2 జట్టుతో తలపడిన వైజాగ్ వెలాసిటీ–3 జట్టు విజేతగా నిలిచి భాష్యం ప్రీమియర్ లీగ్ చాంపియన్‌షిప్‌ను చేజిక్కించుకుంది. ఈ సందర్భంగా జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ భాష్యం విద్యాసంస్థలు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యతనిస్తున్నాయని వివరించారు. భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీలో మొత్తం 720 మ్యాచ్‌లు నిర్వహించామని, బ్రాంచ్ స్థాయిలో 420, జోనల్ స్థాయిలో 281, సెంట్రల్ స్థాయిలో 19 మ్యాచ్‌లు జరిగాయని తెలిపారు. సెంట్రల్ టోర్నమెంట్లో భాగంగా ప్రిలిమినరీస్, క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్, ఫైనల్స్ నిర్వహించినట్లు వివరించారు. అనంతరం వైజాగ్ వెలాసిటీ–3 జట్టుకు భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్ ప్రీమియర్ లీగ్ ఛాంపియన్స్ ట్రోఫీని అందజేశారు.

త్యాగధనుల స్ఫూర్తి ఆదర్శం



పిరమిడ్ ఆకృతిలో భాష్యం విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: త్యాగధనుల స్ఫూర్తి ఆదర్శమని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్ వద్ద ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. భాష్యం బ్లూమ్స్‌లో కాటూరి మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శిల్ప జెండా ఆవిష్కరించారు. విద్యార్థుల పిరమిడ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

మురిసిన మువ్వన్నెల



మాట్లాడుతున్న పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు



జీడీసీఎంఎస్ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జేసీ భార్గవ్‌తేజ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు నగరంలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఊరూవాడా గణతంత్ర ఉత్సాహంతో ఉప్పొంగింది. జీటీ రోడ్‌లోని భారత పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయం ఆవరణలో పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు ఆదివారం జాతీయ జెండాను ఎగురవేశారు. గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(జీడీసీఎంఎస్) ఆవరణలో జిల్లా జాయింట్ కలెక్టర్, జీడీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఎ.భార్గవ్ తేజ మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీడీసీఎంఎస్ జిల్లా బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం, కార్యాలయం మేనేజర్ కె.శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులోనూ జాతీయ పతాకాన్ని బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి ఎ.భార్గవ్ తేజ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ టి.కృష్ణవేణి, జయలక్ష్మి, ఫణి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు. గుంటూరు మార్కెట్ యార్డు ఆవరణలోనూ యార్డు పర్సన్ ఇన్‌చార్జి ఎ.భార్గవ్ తేజ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా మహాత్మాగాంధీ, అంబేడ్కర్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు మిర్చి దిగుమతి సంఘం అధ్యక్షుడు లేళ్ళ పెద అప్పిరెడ్డి, యార్డు ఇన్‌చార్జి సుబ్రమణ్యం, అసిస్టెంట్ ఇన్‌చార్జి శ్రీకాంత్ పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం ఆవరణలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లో ఆ బ్యాంక్ చైర్మన్ బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్ పతాకాన్ని ఆవిష్కరించారు.

70శాతం డబ్లింగ్ పనులు పూర్తి

గణతంత్ర దినోత్సవంలో రైల్వే డీఆర్ఎం రామకృష్ణ



రైల్వే సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఆర్ఎం రామకృష్ణ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): నిర్దేశిత లక్ష్యాల సాధనకు రైల్వేశాఖ సిబ్బంది కృషి చేస్తున్నట్లు గుంటూరు రైల్వే డీఆర్ఎం రామకృష్ణ చెప్పారు. నల్లపాడు రైల్వే పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. ముందుగా డీఆర్ఎం రామకృష్ణ జాతీయ పతాకావిష్కరణ చేశారు. డివిజన్ పరిధిలోని రైల్వే పోలీసులు కవాతు నిర్వహించి జాతీయ పతాకానికి గౌరవ వందనం చేశారు. డీఆర్ఎం మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి రైల్వే శాఖ ఇచ్చిన లక్ష్యాలను అధిగమించినట్లు వివరించారు. సరుకు రవాణాలో ముందున్నామన్నారు. డివిజన్ పరిధిలోని సిబ్బంది జాతీయస్థాయి అవార్డులు దక్కించుకున్నారని వివరించారు. కొత్త రైల్వే లైన్లు, విద్యుదీకరణ, డబ్లింగ్ పనులను ఇప్పటికే 70 శాతం పూర్తిచేసినట్లు వెల్లడించారు. అనంతరం డివిజన్ పరిధిలోని పలు విభాగాధిపతులకు ప్రశంసా పత్రాలను డీఆర్ఎం అందజేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నాట్కో ట్రస్టుకు కలెక్టర్ ప్రశంసాపత్రం



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రూ.50 కోట్లతో నన్నపనేని లోకాదిత్యుడు, సీతారావమ్మ స్మారక నాట్కో క్యాన్సర్ నిర్మాణం చేసి కార్పొరేట్ క్యాన్సర్ వైద్యసేవలు ఉచితంగా అందిస్తున్న నాట్కో ట్రస్ట్‌కు అవార్డు లభించింది. ఆదివారం గుంటూరులో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా నాట్కో ట్రస్ట్ వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు, నాట్కో క్యాన్సర్ సెంటర్ కో-ఆర్డినేటర్ యడ్లపాటి అశోక్‌కుమార్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సదాశివరావు, అశోక్‌కుమార్‌లకు పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్యాధికారులు, నాట్కో క్యాన్సర్ సెంటర్ సిబ్బంది, నాట్కో ట్రస్ట్ సభ్యులు అభినందనలు తెలిపారు.

రక్తనాళాల సమస్యను గుర్తించకుంటే ప్రాణాపాయం



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీనియర్ వ్యాస్కులర్‌సర్జన్

గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల రక్తనాళాల్లో సమస్యలు ఎక్కువ అవుతున్నాయని, వాటిని సకాలంలో గుర్తించకుంటే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని సీనియర్ వ్యాస్కులర్ సర్జన్స్ చెప్పారు. ఆదివారం గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో వ్యాస్కులర్ సర్జన్‌ల నిరాంతర వైద్య విద్య కార్యక్రమం(సీఎంఈ) జరిగింది. కార్యక్రమంలో సీఎంఈ ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ విష్ణుమొలకల విజయ్‌కుమార్ మాట్లాడుతూ రక్తనాళాల్లో సమస్యలను గుర్తించేందుకు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయని, ఆధునిక సర్జరీలూ వచ్చాయని వివరించారు. డాక్టర్ తుపాకుల సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎండో వ్యాస్కులర్, ఓపెన్ సర్జరీల సాంకేతికతను హైబ్రిడ్ విధానాలుగా పిలుస్తారని పేర్కొన్నారు. డాక్టర్ నాగులపాటి సురేంద్ర మాట్లాడుతూ పెరిఫెరల్ వ్యాస్కులర్ వ్యాధిని ఎలా గుర్తించాలి, చికిత్స గురించి వివరించారు. పీజీ వైద్య విద్యార్థులకు వ్యాస్కులర్ అనస్టామోటిక్ శిక్షణ ఇచ్చారు. వ్యాస్కులర్ సర్జన్లు డాక్టర్ సంజన్ జి.దేశాయ్, డాక్టర్ ఆర్.చంద్రశేఖర్, డాక్టర్ సాహు, డాక్టర్ హర్ష, డాక్టర్ దివాకర్, డాక్టర్ మాచినేని కిరణ్, తదితరులు పాల్గొని పీజీ వైద్య విద్యార్థులకు పలు అంశాలు వివరించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, గుంటూరు వ్యాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలు వైద్య కళాశాలకు చెందిన పీజీ వైద్యులు, జూనియర్ వైద్యులు పాల్గొన్నారు.

వివా వీవీఐటీలో గణతంత్ర వేడుక



వేడుకల్లో పాల్గొన్న లెఫ్టినెంట్ కల్నల్ దీపక్ శర్మ, వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

పెదకాకాని: వివా ది స్కూల్, వీవీఐటీలో ఆదివారం గణతంత్ర వేడుకలను నిర్వహించారు. 25 ఆంధ్ర బెటాలియన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ దీపక్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పాఠశాలలోని వీవీఐటీ, వివా ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. లెఫ్టినెంట్ కల్నల్ దీపక్ శర్మ మాట్లాడుతూ జాతీయ భావం గురించి వివరించారు. కార్యక్రమములో వివా వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, వివా డైరెక్టర్ లెఫ్టినెంట్ కమాండర్ కేఎస్ రావు, ప్రిన్సిపల్ చదలవాడ సరళ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్స్ సయ్యద్ బిబన్ బాషా, డాక్టర్ ఎ.శ్రీవాణి పాల్గొన్నారు.

రూ.7.600 కోట్ల జీఎస్టీ రెవెన్యూ లక్ష్యం

- ఇప్పటికే రూ.5,370 కోట్లు వసూలు
- లక్ష్యసాధనకు ఉద్యోగులు కృషి చేయాలి
- సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



కమిషనర్ సాధు నరసింహారెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్న సిబ్బంది

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : జీఎస్టీ ఉద్యోగులు దేశ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఐదు జిల్లాల(ప.గో, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు) సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి సూచించారు. స్థానిక కన్నవారితోటలోని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ కార్యాలయంలో ఆదివారం గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. ముందుగా జాతీయ పతాకావిష్కరణ చేశారు. సిబ్బంది కవాతు నిర్వహించి జాతీయ పతాకానికి గౌరవ వందనం చేశారు. కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి గుంటూరు జీఎస్టీ కమిషనరేట్ పరిధిలో రూ.7,600 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికి రూ.5,370 కోట్ల పన్ను వసూలు చేసినట్లు వివరించారు. కమిషనరేట్ పరిధిలో పన్ను ఎగవేత రూ.345 కోట్లుగా ఉన్నట్లు గుర్తించగా, దానిలో రూ.146 కోట్లు ఇప్పటికే రాబట్టామని పేర్కొన్నారు. అదనపు ఆదాయ సేకరణ, పన్ను ఎగవేత గుర్తింపు, అక్రమ వస్తువుల స్వాధీనం కోసం అధికారులు కృషి చేయాలన్నారు. ఇటీవల గుంటూరులో రూ.12.39 కోట్ల విలువైన చట్ట విరుద్ధమైన సిగరెట్లు, గంజాయి, చైనీస్ వెల్లుల్లిని దహనం చేసినట్లు గుర్తుచేశారు. అనంతరం అంకితభావంతో పనిచేసిన అధికారులకు కమిషనర్ ప్రశంసాపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో నల్లపాడు కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు జానపదం, శాస్త్రీయ నృత్యాలతో అలరించారు. కాసుల కృష్ణంరాజు చేసిన మ్యాజిక్ షో, డ్రాగన్ షోలు ఉద్యోగులను మంత్రముగ్ధుల్ని చేశాయి.

ప్రపంచ దేశాలకు మన రాజ్యాంగం ఆదర్శం

శాసనమండలి చైర్మన్ కె.మోషేన్ రాజు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న శాసనమండలి చైర్మన్ కె.మోషేన్‌రాజు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ దేశాలకు మన రాజ్యాంగం ఆదర్శమని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్ కె.మోషేన్ రాజు పేర్కొన్నారు. ఆదివారం మార్కెట్ సెంటర్‌లోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కేవీర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీజీఎస్ పబ్లిషర్స్ ప్రచురించిన 'భారత రాజ్యాంగం' (సంక్షిప్తంగా) పుస్తకాన్ని శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు ఆవిష్కరించారు. అదే విధంగా 'రాజ్యాంగ నిర్మాణం–రాజ్యాంగ పీఠిక' పుస్తకాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఫొటోలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం పుస్తకాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, భారత రాజ్యాంగం ముఖ్యాంశాలు పుస్తకాన్ని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, సమకాలీన వ్యాసాలు పుస్తకాన్ని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి ఆవిష్కరించారు. మోషేన్‌రాజు మాట్లాడుతూ రాజ్యాంగం విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమ నిర్వాహకుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ లౌకికవాద సంరక్షణ అందరి లక్ష్యం కావాలన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడుతున్న ప్రతిసారీ న్యాయ వ్యవస్థ ప్రజల పక్షాన బలంగా పని చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో కేవీఆర్, జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్ కార్యదర్శి కె.అలీన్, కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ ఈవీ నారాయణ, బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, కన్న మాస్టారు, అవధానుల హరి, ఆవాజ్ నాయకులు చిష్టి, విశ్లేషకులు బి.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



కాలువలో నుంచి వెలికి తీసిన మృతదేహం

తెనాలిరూరల్: స్థానిక యడ్ల లింగయ్య కాలనీలోని మురుగు కాల్వలో ఆదివారం ఓ యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. కాలనీకి చెందిన కరీం బాషా(29) అలియాస్ జండు మురుగు కాలువలో మృతి చెంది పడి ఉండటాన్ని తెల్లవారుజామున గుర్తించిన స్థానికులు మృతదేహాన్ని వెలికి తీయించారు. చిన్న మురుగు కాలువలో యువకుడు కరీం బాషా పడి ఉండటం అనుమానాలకు తావిస్తోంది. స్థానికులు తెనాలి త్రీ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. కుటుంబ సభ్యులను, స్థానికులను విచారణ చేశారు. చెంచుపేటలోని ఓ హోటల్లో మృతుడు పనిచేస్తుంటాడని అతని తల్లి, మేనమామ తెలిపారు. హోటల్ నిర్వాహకులు తరచూ తీసుకెళ్తూ ఉంటారని, శనివారం సాయంత్రం పిండి కలిపే పని ఉందని చెప్పి తీసుకువెళ్లారని వివరించారు. అయితే రాత్రి ఇంటికి రాలేదని స్నేహితుల ఇంట్లో ఉండి ఉంటాడని భావించామని చెప్పారు. అనుకోని విధంగా తెల్లారేసరికి మురుగు కాలువలో శవమై కనిపించాడని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామ ప్రథమ పౌరుడికి అందని ఆహ్వానం



అయ్యన్నపాలెం సచివాలయం వద్ద గణతంత్ర దిన వేడుకల్లో సచివాలయ సిబ్బంది

బొల్లాపల్లి : గణతంత్ర దినోత్సవాన గ్రామ ప్రథమ పౌరుడైన పంచాయతీ సర్పంచ్‌కి ఆహ్వానం అందలేదు. అయ్యన్నపాలెం గ్రామంలో సచివాలయం వద్ద ఆదివారం త్రివర్ణ పతాకం ఎగురవేశారు. సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో జెండా వందన సమర్పణ చేశారు. గ్రామ సర్పంచ్ పి. సాయిబాబుకు ఆహ్వానం లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేసిందని పలువురు చర్చించుకుంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు సర్పంచ్ వెల్లడించారు.